క్లుప్తంగా

నేడు మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

పుత్తూరు: మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం ఈ నెల 31వ తేదీ శనివారం ఉదయం 11 గంటలకు నిర్వహిస్తున్నట్లు కమిషనర్ ఎం.మంజునాథగౌడ్ ఒక ప్రకటనలో తెలిపారు. పురపాలక సంఘ కార్యాలయంలో చైర్మన్ ఎ.హరి అధ్యక్షతన నిర్వహించే సమావేశానికి కౌన్సిలర్లు, కో–ఆప్షన్ మెంబర్లు, అధికారులు విధిగా హాజరు కావాలని కోరారు.

ముమ్మరంగా పారిశుధ్య పనులు



పరిసరాలు శుభ్రం చేస్తున్న వాహనం

నింద్ర: మండలంలోని వివిధ గ్రామ పంచాయతీల్లో శుక్రవారం పారిశుధ్య పనులు చేపట్టినారు. గ్రామాల్లో మురికికాలువలు శుభ్రం చేయడం, రోడ్డుకు ఇరువైపులా పిచ్చిమొక్కలు తొలగించే కార్యక్రమాలు చేపట్టారు. ప్రజలు తమ ఇళ్ల వద్ద కూడా పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని అధికారులు ఆదేశించారు. మండల కేంద్రమైన నింద్ర గ్రామంలో పలు వీధుల్లో పరిసరాలు శుభ్రం చేశారు.

వాసుదేవవర్మ సేవలు ప్రశంసనీయం



వాసుదేవవర్మను సన్మానిస్తున్న అతిథులు

విజయపురం: మండలంలోని పాతర్కాడు ప్రాథమిక పాఠశాల హెచ్ఎం వాసుదేవవర్మ సేవలు ప్రశంసనీయమని ఎంఈఓ శ్యామల అన్నారు. స్థానిక పాఠశాల ఆవరణలో శుక్రవారం వాసుదేవవర్మ పదవీ విరమణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా పలువురు ఉపాధ్యాయులు ఆయన్ను సన్మానించారు. 37 ఏళ్లపాటు ఉపాధ్యాయుడిగా సేవలందించారని కొనియాడారు.

బాలికల పాఠశాలలో సహిత విద్యా కేంద్రం



పాఠశాలను పరిశీలిస్తున్న చంద్రశేఖర్‌రెడ్డి

పుత్తూరు: స్థానిక జడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో సహిత విద్యా కేంద్రం ఏర్పాటు చేసేందుకు శుక్రవారం జిల్లా సహిత విద్యా సమన్వయకర్త చంద్రశేఖర్‌రెడ్డి పాఠశాలను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ప్రత్యేక అవసరాలు కలిగిన విద్యార్థులకు బోధన అందించేందుకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. అందులో భాగంగానే పాఠశాలలో కేంద్రం ఏర్పాటుకు తగిన స్థలం, వసతులు, ఇతర సౌకర్యాలను పరిశీలించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంఈఓలు తిరుమలరాజు, బాలసుబ్రమణ్యం, సహిత విద్య ఉపాధ్యాయులు ఆనంద్, సూర్యకుమారి, హేమలత పాల్గొన్నారు.

మేఘవర్ణం మందడికి ఘన నివాళి



మేఘవర్ణం మందడి మృత దేహానికి నివాళులర్పిస్తున్న నాయకులు

పాలసముద్రం: మండలంలోని కన్నికాపురం గ్రామంలో వైఎస్ఆర్ సీపీ నాయకుడు మేఘవర్ణం మందడి శుక్రవారం ఆకస్మికంగా మృతి చెందాడు. ఆయన మృతదేహానికి జెడ్పీటీసీ సభ్యుడు అన్బలగన్, ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘనంగా నివాళులర్పించారు. పుత్తూరు కేశవరెడ్డి, షణ్ముగరెడ్డి, కుట్టి, రవిరెడ్డి, మనోహర్, పోలయ్య పాల్గొన్నారు.

పారిశుధ్య పనులు పరిశీలించండి



మాట్లాడుతున్న పంచాయతీ కార్యదర్శి

నింద్ర: వర్షాల కారణంగా ప్రజలు అతిసార, ఇతర వ్యాధులు ప్రబలకుండా గ్రామాల్లో పారిశుధ్య పనులను పంచాయతీ వార్డు సభ్యులు పరిశీలించి చర్యలు తీసుకోవాలని కార్యదర్శి ధరణి అన్నారు. శుక్రవారం శ్రీరామాపురంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మట్లాడుతూ పంచాయతీల్లో వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలని అన్నారు. గ్రామాల్లో తాగునీరు సరఫరా చేసే ఓవర్ హెడ్ ట్యాంకులను ప్రతి 15 రోజులకు ఒక సారి శుభ్రం చేయాలని అన్నారు. ట్యాంక్‌లో నీటిని నిలిపిన ప్రతిసారి క్లోరినేషన్ చేసి నీరు సరఫరా చేయాలన్నారు. ప్రతి ఒక్కరు గ్రామాల్లో పరిసరాల పరిశుభ్రత పాటించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

ఉపాధికి లేదు హామీ

నింద్రలో ఉపాధి పనులు చేస్తున్న కూలీలు



పాలక ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలు నెరవేర్చక పోగా ఉపాధి పనులకు ఉన్న హామీని కూడా మరుగున పడేసింది. శ్రామికులకు ఆకలి కేకలు తప్పడం లేదు. రోజంతా స్వేదం చిందించినా ముద్ద నోటి వద్దకు రావడం లేదు. పనులు చేసి నెలలు గడుస్తున్నా వేతన బకాయిలు చెల్లించడం లేదు. ఇదీ ఉపాధి హామీ పథకం కూలీల దయనీయ గాథ. వెరసి కుటుంబ పోషణకు అప్పులు చేయాల్సిన దుస్థితి నెలకొంది. మరోవైపు ఈ పథకం పేదరికమే ప్రామాణికంగా జరగడం లేదు పచ్చపాతం చోటుచేసుకుంటోంది. ఏళ్లతరబడి పనిచేసిన మేట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లను తొలగించి పచ్చనేతలకు, వారి అనుయాయులకు చోటు కల్పిస్తున్నారు. ఇంకోవైపు పనులకు వెళ్లే కూలీలకు భద్రత ప్రశ్నార్థకమైంది.
–నగరి

ఉపాధి కూలీల వివరాలు

నియోజకవర్గం	మండలాలు	పంచాయతీలు	పనిచేసే కూలీలు
నగరి	5	101	9360
గంగాధరనెల్లూరు	6	144	13350
మొత్తం	11	245	22710

- నాడు పేదరికమే ప్రామాణికం.. నేడు అంతా పచ్చపాతం
- కూలీలపైనా కక్ష సాధింపులు
- చేసిన పనులకు వేతనాలు అందక కూలీల అవస్థలు

జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా ఉన్న ఊళ్లోనే పని కల్పించాలన్న ఉద్దేశం నెరవేరడం లేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిరాగేనే ఉపాధి కూలీలపై పచ్చప్రతాపం చూపింది. ఫీల్డ్ అసిస్టెంట్లకు, మేట్లకు రాజకీయ రంగులు పులిమి రకరకాల కారణాలతో వారిని తొలగించి టీడీపీ నేతలకు పని కల్పించింది. దీంతో ఏళ్ల తరబడి పనిచేస్తున్న పలువురు ఉపాధి కోల్పోయారు. రోజంతా రెక్కలు ముక్కలు చేసుకుని శ్రమించినా సకాలంలో కూలి డబ్బులు అందడం లేదు. మార్చి నుంచి చెల్లింపులు స్తంభించడంతో బతుకు బండి లాగేందుకు ఇబ్బందిగా మారిందని ఉపాధి కూలీలు ఆవేదన చెందుతున్నారు. మెటీరియల్ కాంపొనెంట్ బకాయిలు సైతం విడుదల చేయకపోవడంతో కాంట్రాక్టర్లు గగ్గోలు పెడుతున్నారు. ఉపాధి హామీ పథకంపై డివిజన్ పరిధిలో ప్రతి రోజూ 22,210 మంది వరకు ఉపాధి పనులకు హాజరవుతున్నట్లు అధికారులు వెల్లడిస్తున్నారు. కూలీ రోజంతా కష్టపడితే సగటున రోజువారీ రూ.250 నుంచి రూ.300 గిట్టుబాటు అవుతోంది. ఆ డబ్బుతోనే కుటుంబాన్ని పోషించుకోవాల్సిన పరిస్థితి. ప్రతి వారం కూలీ డబ్బులు చెల్లిస్తే ఇంట్లో అవసరాలు, నిత్యావసరాలు కొనుగోలు చేసుకుంటారు. మార్చి నెల నుంచి ఎర్రటి ఎండలో చెమట చిందించి పనులు చేస్తున్నా వేసవి



బోల్తాపడిన ఉపాధి కూలీల ట్రాక్టర్ (ఫైల్)

భత్యం పెంచి ఇవ్వాల్సింది పోయి చెల్లించకుండా ఆపేశారు. దీంతో పస్తులు తప్పడం లేదు. ఉపాధి వేతనాల చెల్లింపులు స్తంభించాయి. ఏడాది కూటమి పాలనలో కూలీలు తమ కుటుంబాలను పోషించుకోవడం కష్టతరంగా మారింది. మరోవైపు భద్రత లేక ట్రాక్టర్ బోల్తాపడి కూలీలు గాయపడిన సంఘటనలు అనేకం

గత ప్రభుత్వంలో ఉపాధికి పండుగ

సొంత గ్రామాల్లోనే పనులు కల్పించి వలసలు నివారించడానికి, ఆర్థిక సంవత్సరంలో కొత్తగా చేపట్టే పనులను సచివాలయం యూనిట్‌గా గుర్తించి



విజయపురంలో ఉపాధి పనులకు హాజరైన కూలీలు

ప్రణాళికలు రూపొందించి పనులు చేపట్టేవారు. రాజకీయ రంగు పులిమి మేట్లను, ఫీల్డ్ అసిస్టెంట్లను తొలగించిన దాఖలాలు లేవు. వారి ఉద్యోగాలకు భద్రత ఉండేది. పేదరికం ప్రామాణికంగా పనులు జరిగేవి. పనుల కల్పన, కూలీల చెల్లింపులో పారదర్శకత ఉండేది. వేసవి భత్యం ఇచ్చేవారు. గత పాలన ఉపాధి కూలీలకు వరంగా ఉండేది. ఏడాది పాలనలో ఇదంతా మారిపోయింది.

కూలి డబ్బులు రాక ఇబ్బందులు



ఉపాధి హామీ పథకంలో కూలీ పని చేశాను, మార్చి నుంచి చేసిన పనికి బిల్లులు అందక ఇబ్బందులు పడుతున్నాం. కుటుంబ పోషణ కష్టతరంగా ఉంది. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఉపాధి హామీ పనులు చేసినవారి సకాలంలో బిల్లులను అందించాలి. –పద్మ, వెంగళరాజుకుప్పం, పాలసముద్రం మండలం

కూలీలు ఆదుకునేది ఉపాధి



పలు కుటుంబాలకు ఉపాధి పనులే దిక్కు. గతంలో పనులు పూర్తి స్థాయిలో ఇచ్చేవారు. కూలి డబ్బు కూడా బకాయిలు లేక అందేది. వేసవిలో కూలీని రూ.15 పెంచి ఇచ్చిన సందర్భాలు కూడా ఉన్నాయి. వారం వారం సక్రమంగా అందే కూలితో కుటుంబ పోషణ సమస్య లేకుండా ఉండేది. కూలీలకు భద్రత ఉండేది. –స్టెల్లాదేవి, నగరి మండలం

కష్టానికి ప్రతిఫలం దక్కేది



గత ప్రభుత్వంలో చేసిన కష్టానికి తగిన ప్రతిఫలం అందేది. ప్రస్తుతం నెలల తరబడి వేతనాలు బకాయి పెడుతున్నారు. రోజు కూలీలైనందున ఆ కూలి డబ్బుని నమ్ముకొని జీవించేవాళ్లం. ఎలాంటి సమస్యలు ఉండేవి కాదు. గతంలోలా కూలి నగదు సక్రమంగా అందించాలి. –కైలాసం, నింద్ర మండలం

కక్ష సాధింపుతో తొలగించారు

నేను ఉపాధి హామీ పథకం గత ఐదేళ్లుగా ఫీల్డ్ అసిస్టెంట్‌గా పని విధులు నిర్వహించా. కూటమి అధికారంలోకి రావడంతో నాపై కక్ష కట్టారు. నిలిచిపోవాలని ఆదేశించారు. కారణం అడిగితే మా ప్రభుత్వం వచ్చింది, జాబ్‌కి నిలిచిపోవాలి లేదంటే జీతాలు ఇవ్వమని బ్లాక్ మెయిల్ చేశారు. అయినా పనికి వెళ్తా పది మంది కూలీలు వస్తే 50 మందికి బిల్లులు ఇవ్వాలంటూ జులుం ప్రదర్శించారు. అలా చేయనని చెబితే ఎంపీడీఓ ద్వారా రిజైన్ చేయాలని నోటీసు ఇచ్చారు. అయినా నేను రిజైన్ చేయలేదు. విచారణ పేరిట నా వద్ద సంతకం చేయించుకొని ఆఫీసుకు వెళ్లాక లేనిపోని అభాండాలు మోపి జిల్లా అధికారులకు సమర్పించి, నన్ను విధులనుంచి తొలగించారు. –రమేష్‌బాబు, కార్వేటినగరం

కాంట్రాక్టు ఉద్యోగులపైనా రెడ్‌బుక్ ఆంక్షలు



పుత్తూరు మండలంలో ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్‌గా ఐదేళ్లుగా పనిచేస్తున్న నన్ను ఎలాంటి కారణం చూపకుండా తొలగించారు. ఇది కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన గత ఏడాది జూన్‌లో జరిగింది. ఫలితంగా నాకు ఉపాధి కరువై నా కుటుంబం ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటోంది. నా విధి నిర్వహణలో ఎలాంటి తప్పు చేయకపోయినా నన్ను తొలగించారు. ఇది కేవలం రాజకీయ కక్ష సాధింపుల్లో భాగంగా జరిగింది. ఇలా మరికొందరిని సైతం ఎలాంటి కారణాలు చూపకనే తొలగించారు. ఇలా పేద కాంట్రాక్ట్ ఉద్యోగుల జీవితాలపైనా కూటమి ప్రభుత్వం కక్ష సాధింపులు చేపట్టడం రెడ్ బుక్ రాజ్యాంగానికి నిదర్శనంగా నిలుస్తోంది. –జె.దీపక్, వేపగుంట గ్రామం, పుత్తూరు మండలం

భూమిని ఆక్రమించి.. ఇసుక రవాణా

- పట్టా భూమిలో అనుమతి లేకుండా వందలాది ట్రాక్టర్లతో ఇసుక తరలింపు





కూటమి నాయకుల దౌర్జన్యంపై మాట్లాడుతున్న మహేశ్వరి, తన భూమిలో ఇసుక ట్రాక్టర్లను చూపుతున్న మహేశ్వరి

గంగాధరనెల్లూరు: పట్టా భూమిలో యజమాని అనుమతి లేకుండా దౌర్జన్యంగా దారి ఏర్పాటు చేసుకుని ఇసుక రవాణా చేస్తుండగా అధికారులు ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదని గారంపల్లి గ్రామానికి చెందిన మహేశ్వరి అనే మహిళ తన గోడు వెళ్లబోసుకుంది. గంగాధరనెల్లూరు మండలం కొట్రకోన పంచాయతీ గారంపల్లి గ్రామానికి చెందిన మహేశ్వరి కుటుంబానికి సదరు గ్రామంలో సర్వేనెంబర్ 611/2బి లో 32 సెంట్లు భూమి అదే కుటుంబానికి చెందిన నందకుమార్ తో భాగస్వామ్యంగా కలదు. ప్రస్తుతం చంద్రబాబు కేశవ అనే కూటమి నాయకులు నందకుమార్‌ను భూమిపైకి రానీయకుండా నీవా నది పరివాహక ప్రాంతంలోని ఇసుక రవాణా చేస్తున్నారు. కప్పం కింద ప్రతి ట్రాక్టర్‌కు 100 రూపాయలు వసూలు చేస్తున్నారు. తన భూమిపై ఉన్న హక్కును కాలరాస్తూ దౌర్జన్యంగా వ్యవహరించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని మహేశ్వరి డిమాండ్ చేశారు.

ఎట్టకేలకు స్లడ్జ్ తొలగింపు



స్లడ్జ్‌ను లారీలకు లోడ్ చేస్తున్న అధికారులు

నగరి: చింతలపట్టెడలో మేన్యువల్ డైయింగ్ యూనిట్ల వారి కోసం నిర్మించిన సీఈటీపీ (కామన్ ఎఫ్లూఎంట్ ట్రీట్‌మెంట్ ప్లాంట్) నుంచి ఎట్టకేలకు అధికారులు స్లడ్జ్ తొలగించే ప్రక్రియను ప్రారంభించారు. ప్లాంట్ పనిచేయకపోవడంతో సరిచేసేందుకు డైయింగ్ యూనిట్లవారు, అధికారులు చేతులెత్తేశారు. డైయింగ్ నుంచి వచ్చిన రసాయన నీరు పూర్తిస్థాయిలో నిండిపోవడం, దీంతో డైయింగ్ యూనిట్ల నుంచి వచ్చే నీరు ప్లాంటుకు పంపక ఆపివేసిన సంగతి విదితమే. ఈ కారణంగా మేన్యువల్ డైయింగ్ నుంచి వచ్చే హానికర రసాయన నీరు కాలువల్లో, చెరువు పక్కనే ఉన్న పల్లపు ప్రాంతంలో చేరడంతో పలు సమస్యలు ఉత్పన్నమయ్యాయి. ఆ సమస్యలు పరిష్కరించేందుకు ఉన్నతాధికారులు రంగంలోకి దిగారు. ప్లాంటును సరి చేసే ప్రక్రియను శుక్రవారం ప్రారంభించారు. తొలుత ప్లాంటు వద్ద పేరుకుపోయిన సుమారు 700 టన్నుల స్లడ్జ్ (రసాయన నీటి శుద్ధీకరణలో వచ్చే వేస్ట్)ను మిషన్ డైయింగ్ యూనిట్ల వారి సహకారంతో తొలగించే ప్రక్రియను ప్రారంభించారు. నగరి వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యుల సమక్షంలో మున్సిపల్ కమిషనర్ కృష్ణారెడ్డి, డీఈ రవీంద్రారెడ్డి నెల్లూరు జిల్లా కోస్టల్ వేస్ట్ మేనేజ్‌మెంట్ ప్రాసెస్‌కు లారీల ద్వారా తరలించడం మొదలుపెట్టారు. మేన్యువల్ డైయింగ్ యూనిట్ల వారు సీఈటీపీకి అనుసంధానమై వినియోగించుకున్న రెండేళ్లలోనే 700 టన్నుల స్లడ్జ్ వస్తే వీరికి పదింతల సామర్థ్యం ఉన్న మిషన్ డైయింగ్ యూనిట్ల నుంచి ఎన్నివేల టన్నుల స్లడ్జ్ రావాల్సి ఉందన్న అంశంపై అధికారులు ఎందుకు దృష్టి సారించడం లేదని విశ్లేషకులు ప్రశ్నిస్తున్నారు.

అనుమతించిన డైయింగ్ యూనిట్లపై క్లారిటీ కావాలి

- ఎవాపరేటర్ ఉన్నవాటికే అనుమతిస్తే కాలువల్లో రసాయనీటి ఎందుకు ప్రవహిస్తోంది?
- ధ్వజమెత్తిన మున్సిపల్ కౌన్సిలర్లు
- రసాభాసగా మున్సిపల్ సమావేశం



మున్సిపల్ కమిషనర్‌తో కౌన్సిలర్ల వాగ్వాదం

నగరి: గతంలో అన్ని డైయింగ్ యూనిట్లు మూసేసిన అధికారులు అందులో ఆరింటికి మాత్రమే అనుమతులు ఇచ్చారని, వారి వద్ద ఏ రికార్డులు చూసి అనుమతించారో క్లారిటీ ఇవ్వాలని మున్సిపల్ కౌన్సిలర్లు అధికారులను నిలదీశారు. శుక్రవారం మున్సిపల్ కౌన్సిల్ హాలులో చైర్మన్ పీజీ నీలమేఘం అధ్యక్షతన మున్సిపల్ కమిషనర్ కృష్ణారెడ్డి నిర్వహించిన మున్సిపల్ సర్వసభ్య సమావేశంలో ఈ సంఘటన చోటుచేసుకుంది. అన్నీ సక్రమంగా ఉన్నాయంటూ అధికారులు ఆరు డైయింగ్ యూనిట్లకు మాత్రమే అనుమతులు ఇవ్వడం, అయినా కాలువల్లో రసాయన నీరు ప్రవహించడం, తాగునీరు కలుషితంగా వస్తుండడంపై కౌన్సిలర్లు అధికారులపై ప్రశ్నల వర్షం కురిపించారు. ఏ ప్రాతిపదికన ఆరు డైయింగ్ యూనిట్లకు అనుమతులిచ్చారో ఆ రికార్డులు కౌన్సిల్‌కు ఒక కాపీ ఇవ్వాలని కౌన్సిలర్ బీడీ భాస్కర్ మున్సిపల్ కమిషనర్, డీఈని కోరారు. తప్పక రికార్డులు అందిస్తామని అధికారులు కౌన్సిల్‌కు హామీ ఇచ్చారు. కౌన్సిలర్ దయానిధి, ఇంద్రయ్య మాట్లాడుతూ డైయింగ్ యూనిట్ల కోసం ఈటీపీ మరమ్మతులకు జిల్లా కలెక్టర్‌కు విన్నవించుకొని నిధులు మంజూరు చేసుకున్న అధికారులు, ప్రజలకు తాగునీరు అందించే సమ్మర్ స్టోరేజ్ ప్లాంట్ మరమ్మతులకు ఎందుకు నిధులు మంజూరు చేసుకోలేక పోతున్నారన్నారు. దీనిపై డీఈ మాట్లాడుతూ ప్లాంటులో ట్యూబర్ సమస్య ఉందని, మరమ్మతులకు రూ.18 లక్షలు అవుతుందని 15వ ఫైనాన్స్ నిధులతో వాటిని చేసుకునేందుకు అనుమతులు కావాలంటూ టేబుల్ అజెండా ఉంచారు. దీనిపై చైర్మన్ మాట్లాడుతూ మున్సిపల్ పరిధిలో ఎన్ని బోర్లు జాతీయ రహదారి విస్తరణలో పోతున్నాయి, ఎన్ని మరమ్మతులకు గురయ్యాయనే వివరాలు స్పష్టంగా అందిస్తే అనుమతులు ఇస్తామన్నారు. ఈటీపీ ప్లాంటు మరమ్మత్తులు పూర్తయ్యేంత వరకు మేన్యువల్ డైయింగ్ యూనిట్ల నిర్వహణ ఆపాలని కౌన్సిలర్లు కోరారు. వైస్‌చైర్మన్ వెంకటరత్నం మాట్లాడుతూ వార్డుల్లో కౌన్సిలర్లకు తెలియకుండా పనులు చేస్తున్నారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారులు, కౌన్సిలర్లు, కో–ఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు.

యోగాతో మానసిక రుగ్మతలు మాయం

వెదురుకుప్పం: యోగాతో మానసిక రుగ్మతలు మాయమవుతాయని ఎంపీడీఓ పురుషోత్తం అన్నారు. శుక్రవారం వెదురుకుప్పంలో జరిగిన యోగా శిక్షణ కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శారీరక, ఆధ్యాత్మిక అభివృద్ధికి యోగాను అలవాటు చేసుకోవాలన్నారు. పంచాయతీ కార్యదర్శులు యోగాంధ్ర సర్వేను పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీఓ మోహన్‌కుమార్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

యోగాతో శారీరక ఒత్తిడి నియంత్రణ



కార్వేటినగరం ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో యోగాసనాలు

కార్వేటినగరం: యోగాతో శారీరక ఒత్తిడిని నియంత్రించవచ్చని ఎంపీడీఓ చంద్రమౌళి అన్నారు. శుక్రవారం ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో యోగాంధ్రలో భాగంగా ప్రభుత్వ అధికారులకు యోగాసనాలపై అవగాహన కల్పించారు. యోగా నిపుణులు అధికారులకు వివిధ రకాలైన యోగాసనాలపై శిక్షణ కల్పించారు. ఈ కార్యక్రమంలో ఏఓ విద్యావతి, సచివాలయ సిబ్బంది, వివిధ శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా ధ్వజారోహణం

శ్రీరంగరాజపురం: మండలం కేంద్రంలో వెలసిన ద్రౌపదీ సమేత ధర్మరాజుల స్వామి వార్షిక మహాభారతం ఉత్సవాల్లో భాగంగా ధ్వజారోహణం ఘట్టాన్ని ఆలయ అర్చకులు వేదమంత్రాల నడుమ శుక్రవారం ఘనంగా నిర్వహించారు. వచ్చే నెల 15 తేదీ వరకు ఉత్సవాలు జరుగుతాయని ఆలయ ధర్మకర్త వేణునాయుడు తెలిపారు. ప్రతి రోజు డాక్టర్ విజయకుమారి ఆధ్వర్యంలో హరికథా గానం ఉంటుందన్నారు. శ్రీ వేంకటేశ్వర కళా నాట్య మండలిచే రాత్రి వీధి నాటకం, ఉభయదారుల ఆధ్వర్యంలో నిత్యాన్నదానం జరుగుతుందని తెలిపారు. ఉభయదారులుగా సుబ్బనాయుడు,భారతి కుటుంబ సభ్యులు వ్యవహరించారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ హరిత, ఆలయ నిర్వాహకులు ఎత్తిరాజులు నాయుడు, రాజశేఖర్ నాయుడు, కుప్పయ్య, నారాయణస్వామి, సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

అల్లిఎల్లమ్మకు ప్రత్యేక పూజలు

గంగాధరనెల్లూరు: మండల కేంద్రంలోని చిత్తూరు–పుత్తూరు జాతీయ రహదారిలో వెలసిన అల్లి ఎల్లమ్మ తల్లికి శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి ఆలయ అర్చకులు ఆనంద అయ్యంగార్ ఆధ్వర్యంలో విశేష సుగంధ ద్రవ్యాలతో అభిషేకం నిర్వహించి, ప్రత్యేక పుష్పాలతో అలంకరించారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

గాలీవానకు కూలిన మర్రిచెట్టు

పాలసముద్రం: మండలంలో శుక్రవారం సాయంత్రం గాలీవానతో కూడిన వర్ష కురవడంతో విపరీతమైన గాలికి బలిజకండ్రిగ–పల్లిపట్టు రోడ్డుపై మర్రి చెట్టు కూలిపోయింది. ద్విచక్ర వాహనంలో వంగునూరు గ్రామానికి చెందిన నేతాజీ వెళ్తుండగా మర్రి చెట్టు కూలిపోయింది. అయితే హెల్మెట్ వేసుకుని ఉండడంతో ప్రమాదం తప్పింది. వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. విషయం తెలుసుకున్న ఎస్ఐ చిన్నరెడ్డప్ప తమ సిబ్బందితో కలసి రోడ్డుపై ఉన్న మర్రి చెట్టును తొలగించారు.

భూవివాదంలో మొక్కలు పెరికివేత

గంగాధరనెల్లూరు: ప్రభుత్వ భూమి వివాదం తీవ్రస్థాయికి చేరింది. మండలంలోని కొండేపల్లి గ్రామ పంచాయతీ రెవెన్యూ పరిధిలో నెల్లేపల్లి పంచాయతీకి చెందిన ఓ మాజీ సైనికుడికి గతంలో ప్రభుత్వం ఐదు ఎకరాల వ్యవసాయ భూమి కేటాయించింది. సదరు భూమికి పక్కనే సర్వే నెంబర్ 345లో 45 సెంట్లు భూమి కొండేపల్లి గ్రామ రైతు అనుభవంలో ఉంది. ఈ భూమిని సొంతం చేసుకోవాలని మాజీ సైనికుడు అధికారులపై ఒత్తిడి తీసుకువచ్చారు. ఈ భూమిలోని మొక్కలను మాజీ సైనికుడు దౌర్జన్యంగా పీకి వేశాడంటూ రైతు ఆరోపించారు. దీనిపై గ్రామస్తులతో కలిసి నిరసన తెలియజేశారు. విషయంపై తహశీల్దార్‌ను వివరణ కోరగా సర్వే చేయించి హద్దులు పెట్టగా ప్రస్తుతం వివాదం తీవ్రం కావడంతో పోలీసులకు ఫిర్యాదు చేసుకోవాలని తెలిపారు.

డాక్టర్ శేఖర్ సేవలు అభినందనీయం



డైట్ ప్రిన్సిపల్ డాక్టర్ శేఖర్ దంపతులను సన్మానిస్తున్న అతిథులు

కార్వేటినగరం: డాక్టర్ శేఖర్ సేవలు అభినందనీయమని విశ్రాంత అడిషనల్ డైరెక్టర్ డాక్టర్ రెడ్డి ప్రకాష్ అన్నారు. శుక్రవారం జిల్లా విద్యాశిక్షణా సంస్థ(డైట్)లో ప్రిన్సిపల్ డాక్టర్ శేఖర్ పదవీవిరమణ కార్యక్రమాన్ని అధ్యాపకులు, ఛాత్రోపాధ్యాయులు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న విశ్రాంత అడిషనల్ డైరెక్టర్ డాక్టర్ రెడ్డి ప్రకాష్ మాట్లాడుతూ ఆయన సేవలను కొనియాడారు. అనంతరం అన్నమయ్య జిల్లా డీఈఓ సుబ్రమణ్యం మాట్లాడుతూ ఛాత్రోపాధ్యాయుల ఉన్నతికి ఆయన కృషి చేశారని తెలిపారు. శేఖర్ దంపతులను శాలువాలు కప్పి, గజమాలలతో ఘనంగా సన్మానించారు. తిరుపతి డీవైఈఓ బాలాజీ, మాజీ ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డి, ఎండపల్లి శ్రీనివాసులురెడ్డి, ఎస్టీయూ యకుడు గాజుల నాగేశ్వరరావు, యూటీఎఫ్ ,నాయకులు ముత్యాల రెడ్డి, ఎస్ఎస్ నాయుడు, వేణుగోపాల్, పీఆర్‌టీయూ నాయకులు బాలాజీ, గురుమూర్తి, ఎంఈఓలు విజయకుమార్, మనోజ్‌కుమార్, సతీష్, బాలసుబ్రమణ్యం పాల్గొన్నారు.

గృహ నిర్మాణాలను పూర్తి చేయాలి



గృహ ప్రవేశంలో అధికారులు

వెదురుకుప్పం: పక్కా గృహ నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలని ఎంపీడీఓ పురుషోత్తం ఆదేశించారు. శుక్రవారం మండలంలోని పచ్చికాపల్లం లేఔట్‌లో లబ్ధిదారులు పూర్తి చేసిన గృహ ప్రవేశ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సకాలంలో గృహాలను పూర్తి చేసేందుకు సిబ్బంది సిద్ధంగా ఉండాలన్నారు. ఇంటి నిర్మాణానికి సంబంధించి దశల వారీగా బిల్లులను చెల్లిస్తున్నట్లు పేర్కొన్నారు. పంచాయతీ కార్యదర్శి సాయిభవాని, ఇంజినీరింగ్ అసిస్టెంట్ సింధూజ, సంక్షేమ సహాయకులు సుదర్శన్, హౌసింగ్ వర్క్ ఇన్‌స్పెక్టర్ ఆంజనేయులు పాల్గొన్నారు.